# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 192

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: మంగళవారం 11 ఆగష్టు 2026








**ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పేపర్ లీక్ ఉదంతంపై విద్యార్థుల నిరసనలు కీలక దశకు చేరుకున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో విద్యార్థులు అసెంబ్లీ వరకూ ర్యాలీని ప్రారంభించారు.**

**సమయం ప్రతినిధి:** ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా స్టూడెంట్స్ రాజధాని రాంచీకి తరలివచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్స్‌పై స్పందించాల్సిందే నంటూ విద్యార్థులు నినదించారు. విద్యార్థులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంది. పలు కూడళ్లు, రహదారులపై బారికేడ్లను ఏర్పాటు చేసింది. సున్నిత పరిస్థితులున్న ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసింది. భారీగా పోలీసులను మోహరించింది. రాంచీలో నేడు ఇప్పటికే స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. రాజధానికి వచ్చే వారి సంఖ్యను వీలైనంతగా పరిమితం చేసేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలు, రాష్ట్ర రహదారులపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. పేపర్ లీక్స్ ఉదంతంపై ఇప్పటివరకూ పలు మార్లు విద్యార్థులు, ప్రభుత్వం మధ్య చర్చలు జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఓ ప్రత్యేక ప్యానల్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయితే, ప్రభుత్వ చర్యలపై పెదవి విరుస్తున్న విద్యార్థులు గతంలో ప్రకటించినట్టు అసెంబ్లీ వరకూ ర్యాలీ ప్రారంభించారు.




**ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ఎంపీ, గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు ఉమర్ అహ్మద్ అనుచరులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నవాబ్‌గంజ్ టోల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో ప్రయాగ్‌రాజ్ పోలీసులు 28 మందిపై కేసులు నమోదు చేశారు.**

**సమయం ప్రతినిధి:** పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొనడం కోసం ఉమర్ తన అనుచరులతో 28 కార్లలో లఖ్‌నవూ నుంచి ప్రయాగ్‌రాజ్ బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున 3.50 గంటల ప్రాంతంలో నావాబ్‌గంజ్ టోల్ ప్లాజా వద్ద ఉమర్ అనుచరులు టోల్ ఫీజు చెల్లించుకుండా వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టోల్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. టోల్ ఫీజు చెల్లించి అక్కడినుంచి వెళ్లమన్నారు. ఆగ్రహానికి గురైన ఉమర్ అనుచరలు హల్‌చల్ చేశారు. టోల్ సిబ్బందితో తప్పుగా ప్రవర్తించారు. అక్కడినుంచి వెళ్లిపోయే సమయంలో టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేశారు. బూత్ నంబర్ 3 వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. టోల్ ప్లాజా అసిస్టెంట్ మేనేజర్ జైప్రకాశ్ యాదవ్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమర్ అనుచరులు తమను కారుతో తొక్కించి చంపుతామని బెదిరింపులకు దిగినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భయపడిపోయిన టోల్ సిబ్బంది అక్కడినుంచి పక్కకు వచ్చేశారని తెలిపారు. యాదవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు 28 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




**(సమయం ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ (APSDMA) తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్టులు జారీ చేసింది. ఉత్తరాంధ్రలోని పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది ఏపీఎస్డీఎంఏ. రానున్న మూడు గంటల్లో విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ సందర్భంగా ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ముఖ్యంగా మాడుగుల, చోడవరం, భీమునిపట్నం, అనంతగిరి, ఎస్.కోట, కొత్తవలస, అనకాపల్లి, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అలాగే శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు, పిడుగులు పడే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని ఆ సంస్థ అధికారులు సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లు వంటి వాటి కింద ఆశ్రయం పొందకుండా సురక్షిత భవనాల్లో ఉండాలని పేర్కొన్నారు. రైతులు, కూలీలు, ప్రయాణికులు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




**ఢిల్లీ, (సమయం ప్రతినిధి):** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని జలశక్తి శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జల వివాదాలు కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 (KWDT-II) పరిధిలో న్యాయ విచారణలో ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. ఈ అంశాలు పరిష్కారం కాకుండా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ చేపట్టడం సాధ్యం కాదని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్రం తిరిగి రాష్ట్రానికి పంపినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు సమగ్ర ప్రణాళికకు అవసరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను పునఃసమీక్షించి సమర్పించాల్సిందిగా సూచించినట్లు తెలిపారు.

**జాతీయ హోదాపై ఎదురుచూపులు..** కాగా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం చాలాకాలంగా కోరుతోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేంద్ర పరిశీలనలో లేదని తాజా సమాధానంతో స్పష్టమైంది. మరోవైపు కృష్ణా జలాల పంపకాలు, అంతర్రాష్ట్ర వివాదాలు ట్రైబ్యునల్ పరిధిలో ఉండటంతో ప్రాజెక్టు అంశంలో ముందడుగు వేసే పరిస్థితి లేదని కేంద్రం తేల్చిచెప్పింది.




**హైదరాబాద్ :** జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ.. ఓటర్లు ఎంతమంది అంటే..?

**హైదరాబాద్:** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.

అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.




**(సమయం ప్రతినిధి):** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై 4.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామున 1:21 గంటల సమయంలో ప్రకంపనలు నమోదయ్యాయి. ఉత్తరకాశీ జిల్లాలోని బర్కోట్ తహసీల్ పరిధిలోని రాజ్‌గర్హి సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూకంప కేంద్రం సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ప్రకంపనల ప్రభావం ఉత్తరకాశీతో పాటు బర్కోట్, పురోలా, మోరి, చిన్యాలిసౌర్, దుండాతో పాటు యమునా లోయలోని పలు ప్రాంతాల్లో కనిపించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో పలువురు ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. భూప్రకంపనల కారణంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం లేదా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. అయితే తెల్లవారుజామున ప్రకంపనలు చోటుచేసుకోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, వివిధ ప్రాంతాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. భూకంప ప్రభావంతో ఎక్కడైనా భవనాలు, నిర్మాణాలకు నష్టం వాటిల్లిందా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రకంపనల అనంతరం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

# సంపాదకీయం

## లిఖిత రూపాల నిరంకుశత్వం

మన దేశంలో – సహజంగానే – కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. మాట్లాడే జంతువు మనిషి మాత్రమే. సుమారు లక్ష సంవత్సరాల క్రిందట భాషకు మౌలిక రూపాలు ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఆదిమ మానవులు గుంపులుగా వేటాడేటప్పుడు, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, జంతువు జాడను తెలియపరచుకుంటూ ముందుకి సాగిన కాలంలో శబ్దాలు, అనుకరణలు, మాటలు అవసరమయ్యాయి. వేట ముగిసాక, రాత్రిపూట మంట చుట్టూ చేరి, మాంసం తింటూ, ఆ రోజున జరిగిన సాహసాల్ని పిల్లలకు వివరించినప్పుడు కథలు పుట్టి ఉండవచ్చు. మాటలు, పాటలయ్యాయి; పాటకి నృత్యం తోడైంది. సాహిత్యం, సంగీతం, భాషతోనే వికసించాయి. భాష అనే ఉమ్మడి సాధనమే మానవ సమూహాల తొలి అస్తిత్వ ప్రకటన. లిపి తరవాతెప్పుడో (సుమారు క్రీ.పూ.3000) పుట్టింది. తిండిని పోగు చేసుకుంటూనో, వేటాడుతూనో, లేదా పశుపోషకులుగానో జీవించిన తెగలకు లిపి అవసరం లేదు. నదీ తీరాలలో స్థిర వ్యవసాయం మొదలై, పట్టణాలు వెల్లివిరిసాక -- నాగరికులకు ఎన్నో వస్తువులు, దినుసులు, వస్త్రాలు, మద్యం, వగైరాలు అవసరమయ్యాయి. అదనపు ఫలసాయం, వస్తు మార్పిడి, ఇతర ప్రాంతాలలో దొరికే వస్తువులను సంపాదించుకోవడానికి తోడ్పడ్డాయి. డబ్బు వాడుకలోకి వచ్చాక, దూర దేశాలతో వ్యాపారం సుగమం అయింది. నౌకా రవాణా వృద్ధి చెంది, రేవులు నగరాలయ్యాయి. ఈ క్రమంలోనే లిపి అవసరమైంది. సింధునదీ ప్రాంతంతో సహా అన్ని ప్రాచీన నాగరికతలలోనూ వర్తకుల ముద్రలకు, సుంకాల పట్టీలకు, పాలకుల ప్రకటనలకు లిపి ఆధారమైంది. శిలాక్షర రూపాల్లో శాసనాలు లిఖించబడ్డాయి. తర్వాతి దశలో అంతవరకూ మౌఖికంగా ఉండిన జానపద గాథలకు లిఖిత రూపం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఆ రాతలు చిలవలు పలవలుగా విస్తరించాయి. ఒకే మూలకథ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో లిఖిత రూపాల్లోకి రూపాంతరం పొందింది. ఈ ప్రక్రియ, పండితుల పూనికతో, పాలకుల ఆధ్వర్యంలో జరిగింది. మౌఖిక రూపాలకు ఉండే స్థానికత, భిన్నత్వం, స్థలకాల విశేషాలకు అనుగుణంగా మలుచుకొనే ఒదుగుబాటు– లిఖిత రూపాలకు లోపిస్తుంది. అవి శాశ్వత శాసనాలుగా, మార్చలేని బోధనలుగా తొందరలోనే అవతరిస్తాయి. దీన్నే ఆధునిక భాషా శాస్త్రానికి ఆద్యుడైన స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి సాసూర్ (1857–1913) 'లిఖిత రూపాల నిరంకుశత్వం' అన్నాడు. అతడి ప్రతిపాదనలను మన దేశానికి, మన ప్రాంతాలకు అన్వయించే ప్రయత్నం ఈ వ్యాసం.పురాణాలు, ధర్మ సూత్రాలు, ముఖ్యంగా పవిత్ర గ్రంథాలు వెలువడ్డానికి లేఖనం గొప్ప వెసులుబాటుని కల్పించింది. స్థానిక విశ్వాసాల సముదాయాలు మతరూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. మనదేశంలో మాత్రం ఒక వైపు తెగల విశ్వాసాలు, మరో వైపు వ్యవస్థీకృత మతం చెట్టాపట్టాలు వేసుకుంటూ కొనసాగుతున్నాయి. చరిత్రకారుడు డి.డి. కోసంబి (1907–1966) చెప్పినట్లు – కొత్తగా ప్రవేశించిన ఏ వ్యవస్థయినా పాత వ్యవస్థను పూర్తిగా తొలగించలేకపోవడం, అన్ని పురాతన పద్ధతులూ, లోలోపలి పొరలుగా కొనసాగడం, మన దేశపు ప్రత్యేకత. ఇందుకు మరో ఉదాహరణ – వేల ఏళ్లపాటు కొనసాగిన వేదాల మౌఖిక రూపం. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా, ఉచ్చారణలో మార్పులు లేకుండా, ఈ పరంపర కొనసాగడం గొప్ప విశేషం. పవిత్ర బోధనలను ముఖస్థం చేయడమే సరైన పద్ధతి అని పూర్వీకుల భావన కావచ్చు; లేదా లిఖిత రూపంలో ఉంటే అవి ఎవరి చేతిలోకి వెళ్లి మైల పడతాయో అనే భయం కావచ్చు. నిష్ఠాపరులైన బ్రాహ్మణులకు తప్ప వేరెవరికీ అందుబాటులో లేని వేదాలను మినహాయిస్తే, పంచమ వేదమైన మహాభారతాన్నీ, అలాగే రామాయణ భాగవతాలనూ, పామరులకు విడమర్చి చెప్పేందుకై పండితులు అవసరం. ప్రవచనకారుల దృష్టి కథా, కథానాలకన్నా సామాన్య జనులు గ్రహించాల్సిన ధర్మ సూక్ష్మాలపైనే ఎక్కువగా ఉంటుంది. అన్ని వ్యవస్థీకృత మతాలలోనూ, పవిత్ర గ్రంథాల్లోని ఒక్క అక్షరాన్ని కూడా మార్చకూడదని సంప్రదాయవాదులు పట్టుబడతారు. ఆ విధంగా శాశ్వత ప్రాతిపదికపై సమాజాన్ని కట్టడి చేయగల సాధనాలను పాలకులు సమకూర్చుకున్నారు. ముద్రణాయంత్రం లిఖిత సంప్రదాయ సుస్థిరతకి, వ్యవస్థీకృత మతాల వ్యాప్తికి, విశేషంగా తోడ్పడింది.మన దేశంలో – సహజంగానే – కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. పాలకుల ఉనికిని కాపాడుకోవడానికీ, ప్రజల్ని నియంత్రించేందుకూ అత్యంత సామర్థ్యవంతమైన ఆలోచనా చట్రమే పాలకవర్గ భావజాలంగా పరిణమిస్తుంది. మౌఖిక భాషాభివృద్ధి దిగువనుండి, లిఖిత రూపం ఎగువనుండి – తమ ప్రయాణాలను ఆరంభించాయి. ఈ క్రమంలో కులవ్యవస్థ కీలకమైన పాత్రను పోషించింది. నిజానికి భారతదేశంలో – ప్రాచీన కాలంలోనైనా, ఆధునిక యుగంలోనైనా – ఏ ఒక్క అభివృద్ధి ప్రక్రియ లేదా మార్పు కూడా కులవ్యవస్థకి బాహ్యంగా జరగలేదు. సామాజిక చలనం తీవ్రతరమైన సందర్భాలలో కూడా కులం బలహీన పడలేదు సరి కదా, కొత్త నిర్మాణాల్లోనూ విడదీయలేని భాగం అవుతూ వచ్చింది. అత్యధిక సంఖ్యలో వినియోగదారులను చేరుకొనేందుకై సినిమా, టీవీ, ప్రింటు మీడియాలకు ప్రామాణిక భాష అవసరం అవుతుంది. సహజంగానే, అది ఆధిపత్య ప్రాంతాల మాండలికం అవుతుంది. ఆర్థికాభివృద్ధిలో, నదీజలాలతో సహా అన్ని సహజవనరుల అందుబాటులో తేడాల మూలంగా ఏర్పడే అసమానతలు, అంతర్గత దోపిడీ, ఉప–వలసీకరణలకి దారి తీస్తాయి. ప్రాంతీయ అస్తిత్వ ప్రకటనల్లో పైకి స్పష్టంగా కనిపించేది మాండలికం అని పిలువబడే భాష; ఆ వెనుకనే ఉండేవి చరిత్ర, సంస్కృతి. ఆర్థిక వెనుకబాటుతనం. తీవ్రమైన అసంతృప్తి, అస్తిత్వ చైతన్యాన్ని జ్వలింపజేస్తుంది; వేర్పాటువాద ఉద్యమాలు మొదలవుతాయి. అందుచేత మాండలిక భిన్నత్వం వెనుక పెద్ద కథే దాగి ఉంటుంది.అదృష్టవశాత్తూ, ఈ నాణేనికి రెండవ పార్శ్వం కూడా ఉంది. ఇటీవలి కాలంలో, ఇంతవరకూ చదువుకి దూరంగా ఉంచబడిన సమూహాల చేతుల్లో అక్షరం ఆయుధంగా మారింది. స్వీయ అనుభవాల ప్రకటన లిఖిత రూపాల్లో ప్రాచుర్యం పొందుతోంది. ఇది ప్రజాస్వామ్యీకరణ వైపుగా మొదటి అడుగు. అక్షరాస్యత అందుబాటులోకి వచ్చాక, వారి కోసం ఎవరో కలం పట్టే అవసరం లేకుండా పీడిత సమూహాల సభ్యులే స్వయంగా రచనలు చేసే స్థాయికి ఒక్క తరంలోనే చేరుకున్నారు. నిజానికి అక్షర ప్రపంచంలోకి దూసుకొచ్చారు. ఈ రాక వెనుక గ్రామీణ పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తూన్న ఉపాధ్యాయుల అదృశ్య పాత్ర చెప్పుకోతగ్గది. దీనికొక నేపథ్యం ఉన్నది. సామ్రాజ్యవాద వ్యతిరేకత పెల్లుబికిన కాలంలో విద్యావంతులైన మధ్యతరగతి, అగ్రవర్ణ సమూహాలలో దేశ విముక్తి కోసమై ఆకాంక్ష బలపడింది. దానికి అనుబంధంగా సమానత్వం, సామ్యవాదం, ఆదర్శాలుగా నిలిచాయి. ఆ దశలోనే భారత రాజ్యాంగ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అభ్యుదయవాద లిఖిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసిపడి, పీడిత జనులకు దగ్గరయ్యే ప్రయత్నాలను ఉద్యమరూపాల్లో తీవ్రతరం చేసింది. ప్రజాహితంగా నడిచే ఏ ఉద్యమమైనా చైతన్యాన్ని రగిలిస్తుంది. అది ఎక్కడో, ఎప్పుడో, ఎవరో ఒకర్ని తాకుతుంది. ప్రజా కళారూపాలకు అభ్యుదయ, విప్లవోద్యమాలు సముచిత స్థానం కల్పించాయి. బాధితులు తమ స్వరాన్ని వినిపింపజేయడం మొదలైనప్పుడు, ఆత్మకథలు, లిఖిత ప్రపంచానికి తెలియని జీవిత వృత్తాంతాలు, వెలువడడం సహజం. ఆ రచనలన్నీ ప్రధానంగా మాండలికాల్లో, యాసతో ఉంటాయి. వాటి నూతనత్వం, అప్పటికే వేళ్లూని ఉన్న లిఖిత వ్యవస్థల దృష్టిని ఆకర్షిస్తుంది. అయితే కొత్త తరానికి అది సరిపోదు. ధిక్కారంగా కొనసాగుతున్న ఈ చైతన్యం, స్వంత వేదికల నిర్మాణ దశకు చేరుకున్నది. ప్రత్యామ్నాయ విలువలను ప్రతిపాదిస్తూ, అన్ని సమూహాలనూ కలుపుకుపోగల సంఘటిత ఇంకా ఏర్పడలేదు. ఆ దశకు చేరినప్పుడు సమానత్వమే ఆదర్శంగా కలిగిన సామ్యవాద చైతన్యం ఆ సంఘటనను ముందుకి నడిపిస్తుంది. సంఘటింగానో, అసంఘటితంగానో – మౌఖిక రూపాలు లిఖిత ప్రపంచంలోకి ప్రవహిస్తూన్న సుదినాలు మనవి. భాష పాత్రోచితంగా ఉండాలా? రచన మొత్తం మాండలికంలో ఉండాలా? ఇతర మాండలీకులను చేరుకొనేదేట్లా? ఇవన్నీ రచయితల నిర్ణయాలే.

## హైదరాబాద్ -బెంగళూరు కారిడార్‌కు ఆమోదం తెలపండి





ఢిల్లీ: హైదరాబాద్–బెంగళూరు రక్షణ పారిశ్రామిక కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని తెలంగాణ నేతలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డి కేంద్ర మంత్రిని కలిసి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌ను అధికారిక రక్షణ, ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని కోరారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు తరహాలో తెలంగాణకు

### మంత్రికి పాలమూరు జిల్లా నేతల విజ్ఞప్తి

ప్రాధాన్యత, ప్రోత్సాహకాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో డజనుకు పైగా రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, డీఆర్‌డీఓ ప్రయోగశాలలు, 1,500కు పైగా ఏరోస్పేస్, రక్షణ రంగ ఎంఎస్ఎంఈలు ఉన్నాయని వివరించారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి: డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 10 (సమయం ప్రతినిధి): భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే. అరుణ మహబూబ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఏర్పాటు చేశారు.'ఏక్ భారత్–-శ్రేష్ఠ్ భారత్' అనే గొప్ప నినాదంతో జాతీయ సమైక్యతను చాటుతూ తన నివాసంలో జాతీయ జెండాను ఏర్పాటు చేసిన ఆమె, అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రజలను చైతన్యపరచాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.కుల, మత, ప్రాంతీయ భేదాలను విస్మరించి భారతీయులంతా ఒక్కటే అనే భావనను 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం చాటుతుందని డీకే అరుణ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేసిన అనంతరం సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు కిరణ్ కుమార్



రెడ్డి, నందిపేట రాజేందర్, దర్పల్లి హరికృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి, పాలమూరు సౌత్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటాం



ఆగస్టు 10, మహబూబాబాద్ జిల్లా కేంద్రం: జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని డా. వివేక్, స్వర్ణకుమారి హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆషాఢ మాస వనభోజనాల కార్యక్రమానికి వారు హాజరై జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారం తప్పక

### కాలనీ కమిటీ హాల్ నిర్మాణానికి సహకారం: డా. వివేక్, స్వర్ణకుమారి
### జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆషాఢ మాస వనభోజనాలు

ఉంటుందని వారు పేర్కొన్నారు. జర్నలిస్టుల కాలనీలో కమిటీ హాల్ నిర్మాణానికి త్వరలో తమవంతుగా నిధులు సమకూర్చుతామని ప్రకటించారు. దీంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యక్రమ నిర్వాహకులు పద్మం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల మధ్య స్నేహభావం, ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. నిత్యం వార్తా సేకరణలో ఒత్తిడితో పనిచేసే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఒకచోట చేరి ఆహ్లాదకరంగా గడపడం ద్వారా నూతన ఉత్సాహాన్ని పొందుతారని తెలిపారు. వనభోజనాల సందర్భంగా ప్రత్యేక వంటకాలను ఏర్పాటు చేసి జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు భోజనాలు అందించారు. అనంతరం పలు సరదా కార్యక్రమాలు నిర్వహించడంతో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి జర్నలిస్టులు ఆనందంగా గడిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అయోధ్య రామమందిర ట్రస్టు సీఈఓ పోస్టు.. ఇంటర్వ్యూకు 18 మంది ఎంపిక

మొదటి పేజీ తరువాయి

అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సీఈఓ పోస్టుకు ఇంటర్వ్యూలు త్వరలో జరగనున్నాయి. ఈ పోస్టు కోసం 5,300 పైచిలుకు మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ కోసం 18 మందిని ఎంపిక చేసినట్టు ట్రస్టు వర్గాలు తెలిపాయి. మంగళ, బుధవారాల్లో ఆలయ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేదీ, శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు మాజీ చైర్మన్ సురేశ్ హావారేలతో కూడిన ప్యానెల్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనుంది. సీఈఓగా 50 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న వ్యక్తిని ఎంపిక చేయనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. హిందూ మతాన్ని ఆచరించే వారు, శాకాహారులైన వారినే సీఈఓగా ఎంపిక చేయనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రామమందిర వ్యవహారాలన్నిటినీ సీఈఓ పర్యవేక్షించాల్సి ఉంటుంది. రామమందిర విరాళాల చోరీ వెలుగులోకి రావడంతో ఇలాంటివి పునరావృతం కాకుండా సీఈఓను నియమించాలని ట్రస్ట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు, విరాళాలచోరీపై దర్యాప్తు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రిపోర్టు మేరకు పోలీసులు ఇప్పటికే ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదును రికవరీ చేశారు. శుక్లా నుంచి అత్యధికంగా రూ.20.39 లక్షలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బంగారం, వెండి నగలతో పాటు విదేశీ కరెన్సీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నేత,పేద బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి,రాష్ట్ర ఎక్సైజ్,టూరిజం,సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు గారి జన్మదినోత్సవం సందర్భంగా... కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేసిన వారిలో కొండూరు గ్రామ సర్పంచ్ కేతూరి ధర్మతేజ మరియు మిత్రులు. ఉన్నారు.

## విద్యావిధానంలో మార్పులు అనివార్యమా...

(సమయం ప్రతినిధి): కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు.ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ –జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం –ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి.





# “శతశాతం”తో విద్యలో విప్లవం

**- వంద స్కూళ్లకు విస్తరణ: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే**

**ఎమ్మెల్యే యెన్నం విద్యా యజ్ఞ రూప శిల్పి: వందేమాతరం ఫౌండర్ రవీందర్**

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా “ శతశాతం ” కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచి సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం నేడు జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందడం, ఆట ( అమెరికా తెలుగు అసోసియేషన్) వారి కమ్యూనిటీ సర్వీస్ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. ఇది ఒక్కరి విజయం కాదని, సమిష్టి కృషి ఫలితమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని లాభాపేక్ష లేకుండా చేపట్టిన ఈ “శతశాతం” కార్యక్రమానికి సమాజంలోని అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. తన సొంత నిధులతో, విద్యాశాఖ సహకారంతో ఎంపిక చేసిన వందమంది విద్యా వాలంటీర్లకు మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు. వాలంటీర్ల బాధ్యతలు, విద్యా వ్యవస్థతో మమేకమవడం, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు సహకారం అందించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సబ్జెక్ట్ నిపుణులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లుగా తీసుకురావడంతో పాటు, సైకాలజిస్టుల






సహకారంతో పిల్లల మనోభావాలను అర్థం చేసుకునే విధంగా శిక్షణ అందించినట్లు వెల్లడించారు. మూడు రోజుల శిక్షణ అనంతరం వాలంటీర్లు తమకు కేటాయించిన పాఠశాలల్లో “శతశాతం” కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. గత ఏడాది 30 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. పాస్ అవుతారా లేదా అనుకున్న విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించడం, 500కు పైగా మార్కులు పొందడం, 16 మండలాల్లో 16 మంది టాపర్లను అందించడం ఈ కార్యక్రమ విజయాన్ని సూచిస్తుందని ఆయన వివరించారు. ఈ విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది కార్యక్రమాన్ని 100 పాఠశాలలకు విస్తరించినట్లు తెలిపారు. ఈ శతశాతం కార్యక్రమం ద్వారా దాదాపు 16 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వందేమాతరం ఫౌండేషన్, విద్యాశాఖ అధికారులు, డీఈఓ, ఇతర అధికారులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, గత అనుభవంతో ఇది స్పష్టమైందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అందరూ ఒక టీమ్‌గా కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. లాభాపేక్ష లేకుండా పిల్లల భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవుతుందనే నమ్మకం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడుతూ రేపటి తరం బాగుకోసం పరితపించే ఇలాంటి నాయకుడు రాష్ట్రంలోనే కాదు దేశంలోనే లేరని, తల్లిదండ్రుల బాధ్యత ను తాను తీసుకుని అన్నీ తానై విద్యార్థుల భవిష్యత్తు కోసం తపిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యా యజ్ఞ రూపశిల్పి అని ఆయన అన్నారు. వారితో కలిసి శత శాతం కార్యక్రమంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలో విద్యావ్యవస్థను బాగు చేయడానికి తన భుజస్కంధాలపై వేసుకొన్నారని ఆయన చెప్పారు. అనంతరం శిక్షణ తరగతులను నిర్వహించిన రీసోర్స్ పర్సన్‌లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయ కర్త రవీందర్ రెడ్డి, పిఆర్టీయు అధ్యక్షులు మదన్మోహన్ యాదవ్, నాయకులు సుధాకర్ రెడ్డి, బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ నేరేడుగొమ్ము మండల కార్యవర్గ సమావేశం



దేవరకొండ: నేరడుగోమ్ము: ఆగస్టు 10(సమయం ప్రతినిధి) : నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామంలోమండల అధ్యక్షులు నాగిళ్ళ ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, మండల ఇంచార్జ్ పాత్లవత్ .అంజి నాయక్ . మాట్లాడుతూ. నేరేడుగొమ్ము మండలంలోని అన్ని బూతులలో బీజేపీ పార్టీ నూతన జెండా దిమ్మ ఆవిష్కరణ ఏర్పాటు చేయాలని...నేరడిగొమ్ము నుండి పేర్వాల వరకు బిటి రోడ్డు వేయాలని ధర్నా కార్యక్రమం నిర్వహించాలని. ఎస్ ఐ ఆర్ .ఓటర్ నమోదు చేయించాలని. బి ఎల్ ఏ లు -2 లకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు టేకులపల్లి సైదులు ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు గుండ్లపల్లి వెంకటేష్ సీనియర్ నాయకులు మారుపాకుల ప్రవీణ్ గాధం ఆంజనేయులు కొండోజు రాము పేర్వాల విజయ్ కొండల్ ఆంజనేయులు సంతోష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ : వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు.

## పాలమూరులో టియుసిఐ ఆధ్వర్యంలో జైలు భరో

**పాల్గొన్న టియూ సి ఐ రాష్ట్ర కార్యదర్శి పద్మ**

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం నాడు మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో జైల్ భరో కార్యక్రమం వందలాది మందితో జరిగినది. మొదట టౌనాల్లో సమావేశమై సమావేశాన్ని ఉద్దేశించి టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎల్ పద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పేదలకు రైతులకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుంది కార్మికుల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ గా మార్చింది గతంలో పదిమంది కార్మికులు కలిసి ఒక సంఘముగా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేది కానీ నేడు ఆ అవకాశం లేదు జీతాలు పెరగటానికి మరియు సకాలంలో ఇవ్వటానికి పోరాటం చేయవలసి వస్తుంది. రైతులకు నష్టం చేసే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు దీనివలన భారతదేశ రైతాంగానికి తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు.అమెరికా వస్తువులు భారతదేశంలో అమ్ముటకు ఎలాంటి సుఖాలు లేవు కానీ మన వస్తువులు అమెరికాలో అమ్ముటకు 18 శాతం టాక్స్ తో అమ్మ వలెను ఈ ఆ సమాన ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. తర్వాత సిఐటియు రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వము అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. అనంతరం టౌన్ హాల్ నుంచి వందలాది మందితో ర్యాలీ ప్రారంభమై పాత బస్టాండ్




తెలంగాణ చౌరస్తా ద్వారా బస్టాండ్ దగ్గర టెలిఫోన్ భవన్ ముందర రాస్తారోకో నిర్వహించడం జరిగింది . దాదాపుగా 40 నిమిషాల పాటు జరిగినది అనంతరం అరెస్టు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో. ఏఐయుకేఎస్ రాష్ట్ర నాయకులు సిహెచ్ రామచందర్ టి యు సి ఐ వెంకటేష్ సాంబశివుడు రైతు సంఘం నుంచి జిల్లా నాయకుడు పి కొండారెడ్డి శివారెడ్డి అంజిరెడ్డి కోళ్ల అంజన్న తిరుపతిరెడ్డి టి యు సి ఐ ఉందాల వెంకటేష్ బాలు రామకృష్ణ పి వై ఎల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## వరుణ యాగం కాదు.. నీటి నిర్వహణపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి

**వచ్చిన వరద నీటిని ఒడిసిపట్టి ఉంటే.. ఈరోజు నీటి కొరత పరిస్థితి ఎందుకు వచ్చేది?**

**కాలం తెచ్చిన కరువు కాదు ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు..**

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్**



హైదరాబాద్: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని కోరుకుంటూ వరుణ యాగం నిర్వహించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్ అన్నారు. అయితే, వరుణుడిని ప్రార్థించే ముందు రాష్ట్రంలో నీటి నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురవాలని, రైతులకు మంచి పంటలు పండాలని కోరుకోవడం అందరి ఆకాంక్ష అని ఆయన అన్నారు. అయితే గతంలో రాష్ట్రానికి భారీగా వచ్చిన వరద నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లు, చెరువులను నింపే విషయంలో ప్రభుత్వం ఎందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేకపోయిందని ప్రశ్నించారు. “వర్షాలు వచ్చినప్పుడు ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టి నిల్వ చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత వర్షాల కోసం యాగాలు చేయడం ఒక్కటే పరిష్కారం కాదు. ప్రార్థనతో పాటు ప్రణాళిక కావాలి.. యాగంతో పాటు సమర్థవంతమైన నీటి నిర్వహణ కావాలి” అని డా. కురువ విజయ్ కుమార్ అన్నారు. గతంలో తెలంగాణలో కేసీఆర్ గారు నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు, కాలువల వ్యవస్థను సమర్థంగా ఉపయోగించుకుని ఉంటే రైతులు నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చేదా అని ఆయన ప్రశ్నించారు. రైతులకు కావాల్సింది కేవలం యాగం కాదు.. పొలానికి నీరు, పంటకు భరోసా, కుటుంబానికి ఆదాయం అని అన్నారు. వచ్చిన వరద నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపి, చెరువులను నింపి, భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేసి ఉంటే ఈరోజు రాష్ట్రంలో నీటి కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. “వరుణుడిని ప్రార్థించడం తప్పు కాదు.. కానీ వరుణుడు ఇచ్చిన నీటిని ఒడిసిపట్టుకోలేకపోవడం మాత్రం ప్రభుత్వ వైఫల్యం. వరుణుడిని వేడుకునే ముందు.. తన ప్రభుత్వం చేపట్టిన నీటి నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి” అని డా. కురువ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ




దేవరకొండ, (సమయం ప్రతినిధి) : యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ . ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రసూతి పొందిన బాలింతలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిన్నెర హరికృష్ణ . మాట్లాడుతూ, యువజన కాంగ్రెస్ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా యువతను ప్రజాసేవ వైపు నడిపించే శక్తివంతమైన వేదికగా పనిచేస్తోందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడుతూ వచ్చిందని తెలిపారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడం, ప్రజలకు అండగా నిలవడం యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యాలని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావడం అంటే కేవలం పదవుల కోసం రావడం కాదు.. ప్రజల కోసం పనిచేసే బాధ్యతను స్వీకరించడం. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడే నాయకత్వాన్ని తయారు చేయడమే యువజన కాంగ్రెస్ అసలు లక్ష్యం అని కిన్నెర హరికృష్ణ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ బలమైన వెన్నెముక లాంటిదని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో యువతను ఏకం చేసి, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో భాగంగా పేదలు, మహిళలు, వృద్ధులు, యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులకు అండగా నిలవాలని, అత్యవసర సమయాల్లో ప్రజలకు సహాయం చేయడంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని అన్నారు. ప్రసూతి అనంతరం ఆసుపత్రిలో ఉన్న బాలింతలను పరామర్శించి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందించడం కూడా ప్రజాసేవలో భాగమేనని సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే బాలు నాయక్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వారికి చేరవేయడంలో యువజన కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని కిన్నెర హరికృష్ణ కోరారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజాసేవలో దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు మేడ సైదులు, నేనావత్ మోతిలాల్. నియోజకవర్గం ఉపాధ్యక్షులు కేతావత్ రమేష్. నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు ఏకుల అంబేద్కర్, ఉమేర్ ఖాషీం, దుబ్బ చరణ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగటి హరీష్, దేవరకొండ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, చందంపేట మండల సాయి రాథోడ్, నేరడుగొమ్ము అధ్యక్షుడు నీలం ఆంజనేయులు యాదవ్, పీఏపల్లి అధ్యక్షుడు రమేష్ నాయక్, దేవరకొండ పట్టణ అధ్యక్షులు మహ్మద్ ఇస్మాయిల్. ఆయా మండలాల కార్యవర్గ సభ్యులు రేకులగడ్డ సర్పంచ్ ఎలుక జలంధర్, కొర్ర రమేష్ నాయక్. కేతావత్ సుభాష్. పొట్ట ప్రభు, కొర్ర కుమార్, ధన్ రాజ్ యాదవ్. చందంపేట సోషల్ మీడియా కోఆర్డినేటర్లు బొడ్డుపల్లి మల్లిఖార్జున్. లింగాల నాగేష్ గౌడ్. భూతం వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌కు మరో షాక్.. కాంగ్రెస్‌లో చేరిన కీలక నాయకులు



దేవరకద్ర : దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై భూత్పూర్ మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా ౹ు మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ ఆంగోత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ యువనాయకుడు కాట్రవత్ ఆనంద్ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నేడు ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడవత్ బాలకోటి ఆధ్వర్యంలో.. వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , భూత్పూర్ మాజీ ఎంపీపీ కదిరే శేఖర్ రెడ్డి , జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు నాగిరెడ్డి గారు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ నాగరాజుకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి..

### అభినందించిన ఎస్ఐ వెంకటేష్ గౌడ్....

పెబ్బేరు ఆగస్టు10 ( వేకువ సమయం ప్రతినిధి) : వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో మూడు సంవత్సరాలుగా కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పదోన్నతుల ప్రక్రియలో భాగంగా కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహించిన నాగరాజు హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ లభించింది. చాలా కాలంగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి ఈ అవకాశం రావడంతో పోలీసు సిబ్బందిలో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన నాగరాజును పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అభినందించి, వారు భవిష్యత్ లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడం మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు విధుల నిర్వాహణలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని ఆయన తెలియజేశారు ఈ సందర్భంగా సోమవారం రోజున పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పోలీస్ సిబ్బంది ఆయన కి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,



హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా

కాకినాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పధ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థు ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు. కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వాములను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

## ఓపెన్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం



(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : మహబూబ్ నగర్ ఫస్ట్ మరియు మహబూబ్ నగర్ జిల్లా సాంస్కృతిక సేన ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించనున్న ఓపెన్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చెస్ వంటి మేధస్సును పెంపొందించే క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యువతలో ఆలోచనా శక్తి, ఏకాగ్రత పెంపొందించడంలో ఇటువంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షులు టంకర శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, రాజు, కేశవులు, ఆనంద్ బాబు, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా మంత్రి వాకిటి శ్రీహరి

### 4.21 లక్షలకుపైగా నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా

హైదరాబాద్ : 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం (GAIS) అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని బిరాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**పథకం ముఖ్యాంశాలు:**

– అర్హులు: 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు
– ప్రీమియం: ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. రాష్ట్ర వాటా రూ.1,34,79,673
– పాలసీ ప్రారంభం: 2026 జూన్ 1 నుండి

**బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు:**

1. ప్రమాదవశాత్తు మరణం – రూ.5.00 లక్షలు
2. శాశ్వత సంపూర్ణ వైకల్యం – రూ.5.00 లక్షలు
3. శాశ్వత పాక్షిక వైకల్యం – రూ.2.50 లక్షలు
4. ప్రమాదవశాత్తు ఆసుపత్రి చికిత్స – గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు.

## అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్, డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన

విజయవాడ : ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

# డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్ర...








**డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్రలో పాల్గొన్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్**
**ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ప్రియాంక కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని అఖిల పక్ష నాయకుల ఆధ్వర్యంలో ఐజ పట్టణంలో ర్యాలీ.**
**హాజరైన మంత్రి జూపల్లి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్,ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**

**సమయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ ఐజా మండలం ఎక్లాస్పురం గ్రామానికి చెందిన ప్రియాంక అనే వైద్య విద్యార్థిని ఆగస్టు 3వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాజమహేంద్రవరంలో ఒక కారు ఆక్సిడెంట్ లో మృతి చెందడం జరిగింది.ఆ వైద్య విద్యార్థిని మృతదేహం నేడు హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ కు చేరుకోగా అలంపురం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ.సంపత్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజ నరసింహ తో మాట్లాడి పోస్టుమార్టం దగ్గరుండి జరిపించి, అక్కడే ఉండి వారి కుటుంబ సభ్యులతో కలిసి అంబులెన్స్ వెంట అలంపూర్ నియోజకవర్గమైనటువంటి ఏక్లాస్పురం గ్రామానికి బయలుదేరడం జరిగింది. అనంతరం ఐజా అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చి ప్రభుత్వం తరఫున ప్రభుత్వంతో మాట్లాడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారితో మాట్లాడి వారి కుటుంబానికి అండగా ఉంటామని మరియు ఇలాంటి దుర్మార్గమైనటువంటి చర్యలు మళ్లీ జరగకుండా పునరావృతం కాకుండా నిందితులకు శిక్ష పడేలా కఠినమైన చర్యలు తీసుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామని సంపత్ కుమార్ అన్నారు. అనంతరం సంపత్ కుమార్ ఐజా పట్టణ కేంద్రంలో ప్రియాంక కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపడం జరిగింది.డాక్టర్ ప్రియాంక కుటుంబం తనకి ఎంతగానో ఎన్నో ఏళ్లుగా చాలా సాన్నిహిత్యమైన కుటుంబమై వారి కుటుంబానికి ఇలాంటి రోజు రావడం చాలా దురదృష్టకరమని అన్నారు ఈ కాలంలో ఆడపిల్ల చదువుకోవడమే కష్టంగా మారిన పరిస్థితుల్లో చేతికిందిన వైద్య విద్యార్థిని ఇలా చేతిలో మృత్యువాత చెందడమనేది అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ గారితో పాటు మంత్రి జూపల్లి, గద్వాల శాసనసభ్యులు కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప వైస్ చైర్మన్ కుమార్ మరియు ఐజా పట్టణ కౌన్సిలర్లు షేక్షావలి సులోచన, మైనర్ బాబు, ఆ మద్దిలేటి, వివిధ గ్రామాల సర్పంచులు,, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అఖిలపక్ష నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు , వైద్య విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించిన మంత్రి జూపల్లి , గద్వాల ఎమ్మెల్యే బండ్ల







సమయం ప్రతినిధి గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన డాక్టర్ ప్రియాంక అంతిమ యాత్ర లో లిరాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని , ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి అశ్రునయనాల మధ్య నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించి ఉరితీయాలి.

**మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ...**

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జరిగిన ఈ సంఘటన అత్యంత దుర్మార్గమైనది, మానవత్వానికే మచ్చ తెచ్చేలా ఉంది. ఇది ఎంతమాత్రం ప్రమాదం (యాక్సిడెంట్) కాదు, 100% ప్రణాళికాబద్ధంగా చేసిన హత్యే అని,?ఈ ఘటనకు కారణమైన నిందితులకు చట్టప్రకారం కఠినమైన ఉరిశిక్ష పడేలా చూస్తామని, ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో కూడా మాట్లాడతానని తెలిపారు.ఘటన గురించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని, బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అంత్యక్రియల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత మళ్లీ వచ్చి కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠినమైన నూతన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**గద్వాల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ...**

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వెంటనే ఉరిశిక్ష వేయాలి: ఐజ మండలానికి చెందిన డాక్టర్ ప్రియాంకను హత్య చేసిన నిందితులను వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, 2-3 నెలల వ్యవధిలోనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. కేసు విచారణను నెలల తరబడి సాగదీయకుండా త్వరితగతిన న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందించాలని కోరారు. మహిళల భద్రతకు భరోసానిచ్చేలా చట్టాల్లో మార్పులు తెచ్చి, కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, విక్రమ్ సింహారెడ్డి, ,ాూజు చైర్మెన్ తిమ్మారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్స్ గోవిందు రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్, నాగిరెడ్డి,నరహరి శ్రీనివాసులు, ఇసాక్, నాయకులు గోవిందు, వంట భాస్కర్, సుదర్శన్, రిజ్వాన్, మోసిన్, మైలగడ్డ చంద్రశేఖర్ ,డి. వై రామన్న, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటన్న, చిరు, కిట్టు, నాగార్జున, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరం: మాజీమంత్రి




(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : వైద్యురాలిగా ఎంతో మందికి వైద్య సేవలు అందించాల్సిన ప్రియాంక మృతి బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐజ మండలం ఎక్లాస్ పూర్ గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఈమె గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యం అందించాలానే తలంపుతో వైద్య విద్య అభ్యసిస్తూ అర్ధంతరంగా కన్నుమూయడం కలిచి వేసిందన్నారు. కారు ఎక్కించి తీవ్రంగా గాయపరిచిన నిందితులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రియాంక వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించడంతో పాటు కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. కోటి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసారు. ఈ కష్టకాలంలో భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మెడికో ప్రియాంక మృతి బాధాకరం... బిఆర్ఎస్

గద్వాల : వైద్యురాలిగా ఎంతో మందికి వైద్య సేవలు అందించాల్సిన ప్రియాంక మృతి చెందడం చాలా బాధాకరం అని బాసు హనుమంతు నాయుడు అన్నారు...లిజోగులాంబ గద్వాల జిల్లా ఏక్లాస్ పురం గ్రామానికి చెందిన ప్రియాంక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆమె, గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్య విద్యను అభ్యసిస్తూ అర్ధాంతరంగా కన్నుమూయడం కలిచివేసింది అని అన్నారు..ఈ కష్టకాలంలో భగవంతుడు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రియాంక వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించడంతో పాటు,కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించాలి అని,ప్రియాంక మృతికి కారణమైన నిందితులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.

## మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతికి కారణమైన దుండగులను మహిళా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఏపి ప్రభుత్వం వెంటనే శిక్షించాలి

**ఎన్.విజయ్ కుమార్ జిల్లా ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల యూనియన్ అధ్యక్షుడు జోగులాంబ గద్వాల జిల్లా**



జోగులాంబ గద్వాల జిల్లా ఆగస్టు 10 : ఐజ మండలం ఎక్లాస్ పురం గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక ను రాజమండ్రిలో కర్కషత్వంగా యాక్సిడెంట్ చేసి ఆమె మృతికి కారణమైన దుండగులు జోసెఫ్, దుష్యంత్ లను ఏపీ ప్రభుత్వం స్పందించి కఠినంగా శిక్షించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్సీ ఎస్టీ న్యాయవాదుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.విజయకుమార్ కోరారు. మెడికల్ విద్యార్థిని ప్రియాంక చిన్న వయసులో నుండే చదువులో చురుకుగా ఉంటూ ఎంబీబీఎస్ సీటు సాధించి పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎంబిబిఎస్ చదువుతున్న సమయంలోనే దుండగుల చేతిలో మృత్యు ఒడిలోకి చేరడం,కుటుంబ సభ్యులకు,జిల్లా వాసులకు తీరనిలోటని అన్నారు.ఏది ఏమైన మెడికల్ విద్యార్థిని ప్రియాంక మృతికి కారకులైన నిందితులను మహిళా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కమలంలో కాక్రోచ్ కలవరం!

సమయం ప్రతినిధి : రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడంలో విజయం సాధిస్తూ వచ్చిన ప్రధాని మోదీ అదే మార్గంలో యువతను కట్టడి చేయలేమని గుర్తించినట్టున్నారు. రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులకు అనేక బలహీనతలు ఉంటాయి. వాటిని ఉపయోగించుకొని వారందరినీ బీజేపీ పెద్దలు కట్టడి చేస్తూ వచ్చారు. ఈ కారణంగానే ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన అనేక గొంతులు మూగబోయాయి. యువత పరిస్థితి వేరు. పోరాడితే పోయేది ఏమీ లేదు– మహా అయితే సంకెళ్లు పోతాయి అన్నట్టుగా యువత ధోరణి ఉంటుంది. బొద్దింకల ఉద్యమంలో అదే కనిపించింది. ఆరెస్సెస్ కూడా గత కొంత కాలంగా కేంద్ర పెద్దల పోకడల పట్ల సంతృప్తిగా లేదన్న ప్రచారం ఉంది. బొద్దింకల ఉద్యమం, ఆ తర్వాత బిహార్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీ చేసిన అసెంబ్లీ స్థానాన్ని ఉప ఎన్నికల్లో కోల్పోయిన తర్వాత ఆరెస్సెస్ పెద్దలు తమ అభిప్రాయాలను బాహాటంగా చెప్పడం మొదలెట్టారు. చర్చకు మరో రూపమే నిరసన అని, ప్రజాస్వామ్యంలో అది చట్టబద్ధమని, సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనలు పుట్టుకొస్తాయని, ఎన్నికల్లో విజయాలే నాయకత్వానికి నిదర్శనం కాదని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మోదీని దృష్టిలో పెట్టుకొని చేసినవే అన్న అభిప్రాయం ఏర్పడింది. జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత మోదీ కొంత డల్‌గా కనిపిస్తున్నారు. తాజా పరిణామాలు తొలి ఎదురుదెబ్బగా పేర్కొనవచ్చు. ఈ నేపథ్యంలో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నుంచి మోదీకి అనూహ్య మద్దతు లభించింది. వారిద్దరూ మోదీని ఆకాశానికెత్తారు. మోతాదుకు మించి ప్రధానిని పొగిడారన్న అభిప్రాయం కూడా ఉంది. మోదీ బలంగా ఉన్నప్పుడు చంద్రబాబు 2019లో ఆయనతో గొడవ పెట్టుకున్నారని, ఇప్పుడు మోదీ బలహీనపడుతున్నప్పుడు అవసరానికి మించి నెత్తిన పెట్టుకుంటున్నారన్న అభిప్రాయం టీడీపీ నాయకుల్లోనే ఉంది. తాము ప్రెషర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ప్రకటించడం శుభపరిణామం. రాజకీయాల్లో బురద పూసుకొనేవారు ఉంటారు కనుక ఆ బురదను కడిగే వాళ్లూ ఉండాలి. మన దేశంలో అంతో ఇంతో ప్రజాదరణ పొందిన వాళ్లు విజిల్ బ్లోయర్ పాత్ర ఎంచుకోకుండా రాజకీయాల్లోకి వెళ్లి కనుమరుగవుతున్నారు. అందుకే ఒత్తిడి తీసుకురాగలిగిన ప్రెషర్ గ్రూపు అవసరం. మన దేశంలో ఏ ఒక్క వ్యవస్థ కూడా స్వతంత్రంగా పనిచేయడం లేదు. ఇంకా చెప్పాలంటే వాటిని పనిచేయనివ్వడం లేదు. పై వాళ్ల ఆదేశాలకు అనుగుణంగా వ్యవస్థలు నడుచుకుంటున్నాయి. సీజేపీ రూపంలో ఇప్పుడు మన దేశంలో జవాబుదారీతనం కోసం ప్రారంభమైన ఉద్యమం అలా చల్లబడి పోకూడదని కోరుకుందాం. జాతీయ రాజకీయాలలో బాహుబలిగా ఎదిగి, 2029 ఎన్నికల్లో కూడా మెజారిటీ సాధించి నాలుగో పర్యాయం ప్రధానమంత్రిగా కొనసాగాలని తలపోస్తున్న నరేంద్ర మోదీ ప్రభ మసకబారుతోందా? గతంలో రైతులు నెలల తరబడి ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలకు ఏమాత్రం చలించని ప్రధాని మోదీ, నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌పై కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఉద్యమానికి తలొంచారా? ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడమే నాయకత్వానికి నిదర్శనం కాదని ప్రధాని మోదీని దృష్టిలో ఉంచుకొనే ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారా? అని ప్రశ్నించుకుంటే 'అవును' అనే సమాధానం వస్తోంది. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమంలో నిజానికి లక్షల సంఖ్యలో విద్యార్థులు పాల్గొనలేదు. ఆ ఉద్యమంలో పాల్గొన్న వారి సంఖ్య పది వేలకు మించి ఉండదని ఒక అంచనా. అంతకు మించిన సంఖ్యలో రైతులు చేపట్టిన ఉద్యమానికి ప్రధాని మోదీ ఎందుకు దిగి రాలేదు? అంటే కారణం లేకపోలేదు. రైతు ఉద్యమంలో కేవలం పంజాబ్, హరియాణాకు చెందిన రైతులే ఎక్కువగా పాల్గొన్నారు. వారి ఉద్యమానికి సంఘీభావంగా ఇతర రాష్ట్రాల రైతులు ఉద్యమ బాట పట్టలేదు. విద్యార్థులు చేపట్టిన ఉద్యమం అలా కాదు. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల్లో ఎంత మంది పాల్గొన్నారనే దానికంటే... సదరు ఉద్యమానికి మద్దతుగా అనేక రాష్ట్రాలలో, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో విద్యార్థులు రోడ్డెక్కడం కీలకం! బహుశా ఈ పరిణామం ప్రధాని మోదీ ఒక మెట్టు దిగి వచ్చేలా చేసి ఉంటుంది. జెన్--జీ ఉద్యమాల వల్ల శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లలో ప్రభుత్వాలు మారిపోయాయి. ఇప్పుడా దేశాలలో జెన్--జీ ప్రభావం కనిపిస్తోందా? అంటే అది వేరే విషయం! మన దేశంలో కూడా జెన్--జీ ఉద్యమాలు ప్రభుత్వాలను మార్చగలవా? అంటే ఆ పరిస్థితి లేదనే చెప్పాలి. అయితే... దేశ ప్రజలలో, ముఖ్యంగా యువతలో అశాంతి, అసహనం నెలకొన్న విషయాన్ని జంతర్ మంతర్ ఉద్యమం ప్రస్ఫుటం చేసింది.






# మోడీ విధానాలను నిరసిస్తూ వనపర్తిలో జైల్ భరో జయప్రదం

## వేలాదిగా పాల్గొన్న కార్మికులు, కర్షకులు వ్యవసాయ కూలీలు









(సమయం ప్రతినిధి వనపర్తి) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ విధానాల నిరసిస్తూ సోమవారం నాడు సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో వేలాదిగా తరలివచ్చిన కార్మికులు వివిధ రంగాలకు చెందిన వారు ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ సెంటర్ లో CITU, TUCI, AITUC, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో ఒక గంట పాటు రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించిన కార్మిక సంఘాల నాయకులు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం కార్మిక సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసిన పోలీసులు తక్షణమే నాయకులను విడుదల చేయాలని కార్మికులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్కు చేరుకొని నినాదాలు చేశారు,. అదుపులోకి తీసుకున్న వారిని పోలీసులు సొంత పుష్పత్తి మీద విడుదల చేశారు పోలీసులు సొంత పూచీకత్ మీద కార్మిక సంఘాల నేతలను విడుదల చేశారు, ఈ రాస్తారోకోను ఉద్దేశించి CITU జిల్లా అధ్యక్ష కార్యదర్శులు R N రమేష్, మండ్ల రాజు, TUCI జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు జ రాజు,AITUC జిల్లా కార్యదర్శి మోష, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్ ఆచారి జిల్లా ఉపాధ్యక్షులు జి ఎస్ గోపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అజయ్, మేకల ఆంజనేయులు తెలంగాణ ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజన్న, వెంకటయ్య. ఏఐకేస్ నాయకులు రాబర్ట్ మాట్లాడుతూ కార్పొరేట్ల దేశ సంపద ఆక్రమణకు, న్యాయమైన వేతనాలను తిరస్కరించడానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతుల ఐక్యతను చాటడమే నిదర్శనం అన్నారు . అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు హామీ కల్పించడంతో పాటూ, సిటు ప్లస్ 50 శాతం ఫార్ములాతో లెక్కించిన మేరకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను ఇచ్చేందుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలన్న డిమాండ్ చేశారు. దీనికి తోడు, నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి . అలాగే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను 2025ను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవేటీకరణ, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు కార్మికులందరికీ నెలకు రూ.31 వేలు చొప్పున కనీస వేతనం చెల్లించాలని,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)ని పునరుద్ధరించి, 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.700 దినసరి వేతనం అమల్జేయాలి.సార్వత్రిక సామాజిక భద్రత ఫించను నెలకు రూ.10 వేలు చొప్పున అందజేయాలి.ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదించిన సి2 ప్లస్ 50 శాతం ఫార్ములాతో అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా అమెరికాతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలి.వ్యవసాయ, ఆహార శుద్ధి, ఆహార ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక ఎంఎస్ఎంఇ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లను అనుమతించరాదన్నారు.భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ని రక్షించి మరింత బలోపేతం చేయాలి.ఎఫ్‌సిఐ గోదాముల స్థానంలో అదానీ – లీప్ ఇండియా గుత్తాధిపత్యానికి తెర దించాల విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లు 2025, విత్తన బిల్లు 2025, ఎన్ఎఫ్ఎస్ఎ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి. సహకార సంస్థల్లో కార్పొరేట్ సంస్థల ఆక్రమణలను ఆపేయాలి. అన్నదాతల నేతృత్వంలో ప్రజాస్వామిక సహకార సంస్థలను బలోపేతం చేయాలి.సమగ్రమైన రుణ మాఫీ పథకాన్ని ప్రకటించి అప్పుల ఊబిలో నుంచి గ్రామీణ ప్రజలను గట్టెక్కించాలి.ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయాలి. బలవంతపు భూసేకరణను, కార్పొరేట్ భూసమీకరణను ఎటువంటి పరిస్థితుల్లోనూ చేపట్టకూడదు.భూ సేకరణ చట్టం 2013, అటవీ హక్కుల చట్టం 2006, పీసా 1996 చట్టాల ప్రకారం భూ హక్కులను పరిరక్షించాలి. ఎరువులు, ఇంధనం, వంటగ్యాసు, పెట్రోలు, డీజిల్ ధరలను నియంత్రించాలి. సబ్సిడీలను పునరుద్ధరించాలి. రైతులందరికీ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పంటల బీమా, పశువుల బీమా కల్పించాలని వాటర్‌షెడ్లను అభివృద్ధి చేసి ప్రతి పొలానికి నీటి సౌకర్యం కల్పించాలి.వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో పారదర్శకమైన సహాయాన్ని అందజేయాలి. ఇందుకోసం తగిన నిధులు కేటాయించాలి.విద్య కోసం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 6 శాతం నిధులు కేటాయించాలి.కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 6 శాతం, అలాగే జిడిపిలో 3 శాతం నిధులను పరిశోధన, అభివృద్ధి రంగానికి కేటాయించాలి. ఈ కార్యక్రమం నికి ఝావీ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి లీల, లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, ఎంపీ ఆర్డీ నాయకులు మద్దతు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో CITU జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము బుచ్చమ్మ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు, కే సునీత, శారద కవిత TUCI నాయకులు పెంటయ్య దేవమ్మ గణేష్, కురుమయ్య , AITUC నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# డీపీఆర్ వెనక్కి పంపడం దుర్మార్గం



## పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై కేంద్రానికి చిత్తశుద్ధి ఏది?

## ప్రధాని జాతీయ హోదా హామీ ఏమైంది? - మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 10 (సమయం ప్రతినిధి): పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మరోసారి బట్టబయలైందని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రతిష్టాత్మకమైన పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తిప్పి పంపడం దుర్మార్గమని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు పాలమూరు జిల్లాకు అన్యాయం చేయడమే పనిగా పెట్టుకున్నాయని లక్ష్మారెడ్డి ఆరోపించారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 16 మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలకు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా ఎంపీల్లో ఒక్కరు కూడా గట్టిగా మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

### తెలంగాణ నీటి హక్కులను ఏపీకి దోచిపెడుతున్నారు

తెలంగాణకు దక్కాల్సిన నీటి హక్కులను కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెడుతున్నాయని లక్ష్మారెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు ఎజెండాను అమలు చేస్తున్నారని, పాలమూరు ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు సంబంధించిన కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పాలమూరు ప్రజలకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలమూరు జిల్లాను వలసల జిల్లాగా మార్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు మరోసారి జిల్లాకు తీరని అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రజల సాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన ప్రాజెక్టులను రాజకీయ ప్రయోజనాల కోసం పక్కన పెట్టడం సరికాదన్నారు.

### ప్రధాని హామీ ఏమైంది?

గతంలో పాలమూరు జిల్లాకు వచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. అయితే ఆ హామీ నేటికీ అమలు కాలేదని విమర్శించారు. ప్రధాని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వానికి వివక్ష కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. చివరకు పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కూడా వెనక్కి పంపడం ద్వారా కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమైందన్నారు. ఇదేనా తెలంగాణపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు.


ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చెందిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మాత్రం ఎందుకు జాతీయ హోదా ఇవ్వడం లేదని నిలదీశారు. ఇతర రాష్ట్రాల ప్రాజెక్టుల్లో లేని అభ్యంతరాలు తెలంగాణ ప్రాజెక్టుల విషయంలోనే ఎందుకు వ్యక్తమవుతున్నాయని ప్రశ్నించారు.

### 90 శాతం పనులు పూర్తి చేసినా డీపీఆర్‌పై అభ్యంతరాలా?

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని లక్ష్మారెడ్డి తెలిపారు. ఒకటి రెండు మినహా దాదాపు అన్ని రకాల అనుమతులు సాధించిన ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వెనక్కి పంపడం వెనుక కారణాలను కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని, తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ హోదా కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణలోని అనేక ప్రాంతాలకు సాగునీరు, తాగునీటి ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు ప్రజల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే డీపీఆర్‌ను ఆమోదించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం తదుపరి తీవ్ర కార్యాచరణకు ప్రణాళికలు రూపొందిస్తామని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి హెచ్చరించారు.









# ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి ఘన సన్మానం

(సమయం ప్రతినిధి మహబూబ్‌నగర్) : ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ నియోజక వర్గంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న నేపథ్యంలో, వారి సేవలను గుర్తించిన ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) సంస్థ ప్రతిష్టాత్మకమైన 'కమ్యూనిటీ సర్వీస్ అవార్డు' ను అమెరికా వేదికగా ఆయనకు ప్రదానం చేసింది. ప్రజాసేవకు కట్టుబడి అహర్నిశలు పని చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎమ్మెల్యేకి ఈ అవార్డు లభించడం ప్రత్యేకంగా నిలిచింది. అవార్డు అందుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం, మహబూబ్ నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని ఎమ్మెల్యే గారిని మర్యాదపూర్వకం గా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. సమాజ సేవలో ఎమ్మెల్యే చూపుతున్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం, ముఖ్యంగా విద్యాభివృద్ధి కోసం ఆయన తీసుకుంటున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని నాయకులు కొనియాడారు. నియోజకవర్గ అభి వృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల




మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్, ఎన్.పి. వెంకటేష్, కార్పొరేటర్లు తాహెర్, ప్రశాంత్, ఫక్క, షబ్బీర్ అహ్మద్, ఎంపి ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, యాదగిరి గౌడ్, మజ్జీద్, పాతూరి రమేష్, రాధ గోవర్ధన్, భాను చందర్, మోసిన్, నాయకులు మైత్రి యాదయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, బొట్టు శ్రీను, చెన్నయ్య, జాజి మొగ్గ నర్సింహులు, రాషెద్ ఖాన్, ఏర్పుల నాగరాజు, వర్ధ రవి, తులసి రాం బండి మల్లేష్, అబ్దుల్ హక్, ఖాజా పాషా, తెలుగు గూడెం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ పాలనకు చరమగీతం పాడాలీ

దేవరకొండ: నేరడుగొమ్ము: ఆగస్టు 10 (సమయం ప్రతినిధి) : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ని గద్దె దించాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ జాతీయ సమితి పిలుపులో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార యాత్ర లో భాగంగా నేరడిగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి పెద్దమునిగల్, కొత్తపల్లి పేర్వల,నేరడిగొమ్ము తిమ్మాపూర్ గ్రామంలో జరిగిన సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు... కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలను పెంచి సామాన్యులు బతకలేని పరిస్థితిని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని,పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్ ధరల పెంపు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్నారని ప్రజల పై ఏమాత్రం బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీకి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. విద్యావ్యవస్థను గాడిన పెట్టలేని కేంద్ర బిజెపి సర్కార్ యువత నుండి వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవడంలో కంటి తుడుపు చర్యలు చేశారు. విద్యార్థులతో పెట్టుకుంటే ఎం జరుగుతుందో మోదీ కళ్లారా చూసారని అన్నారు.దేశంలోని విద్యారంగం నుండి మొదలుకొని అనేక రాజ్యాంగబద్ధ సంస్థలకు అధిపతులుగా ఆర్ఎస్ఎస్ సంబంధించిన వారిని నియమించిన తర్వాతనే వ్యవస్థలు పతనావస్థకు చేరుకున్నాయనేది వాస్తవం అన్నారు. 12 ఏళ్ల కాలంలో ఏనాడు బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన ఒక్క మాట కూడా మాట్లాడని ఆర్ఎస్ఎస్ ఇవాళ బయటకు వచ్చి పచ్చి మోసం, దగా చేయడానికి ప్రగల్భాలు పలుకుతున్నదని అన్నారు.ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన యువతరంపై ఇంకా వివిధ రాష్ట్రాలలో కేసులు పెడుతూ బెదిరిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని కనీస వేతనాలు అందుకోలేని కార్మిక వర్గం శ్రమదోపిడికి గురవుతున్నదని, లక్షలాదిమంది ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కోల్పోతున్న తరుణంలో మరింత నిరుద్యోగాన్ని పెంచే విధంగా బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు చేస్తున్నదని అన్నారు.కొత్త ప్రభుత్వ పరిశ్రమల ఊసులేదని,ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. ప్రజలను




పట్టించుకోని ప్రభుత్వ పథకాలు అందించాల్సింది పోయి కేవలం మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేవుళ్ళ పేరుతో బీజేపీ చేస్తున్న రాజకీయం ఎంతో కాలం చెల్లదని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం,పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడుకునే క్రమంలో సిపిఐ పార్టీ సెప్టెంబర్ 1వ,తారీఖున లక్షలాది మందితో రామ్ లీలా మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్,ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ్,, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దిన్, నేరడిగొమ్ము మండల కార్యదర్శి బొమ్ము రామాంజనేయులు , దేవరకొండ, చందంపేట, మండల పార్టీ కార్యదర్శులు ఉప్పునూతల వెంకటయ్య, సుదర్శన్ రెడ్డి నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు,రామ స్వామి, పల్లా రంగారెడ్డి, ఏం వెంగలయ్య.గిరిజన సమాక్యా జిల్లా అధ్యక్షులు దేవీలాల్ రమేష్ శివ బిక్ష మయ్య,సురేష్ ఆంజనేయులు వెంకటాచారి, నరేందర్, చందు, బక్కయ్య, మల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్ట్‌లో బెల్ట్ షాపుల జోరు.. ఎక్సైజ్ నిఘా బేజారు..!!

### జూరాల పర్యాటక కేంద్రంలో అక్రమ మద్యం దందా..!!



ఆత్మకూరు : వనపర్తి జిల్లాలోని జూరాల పర్యాటక కేంద్రంలో చేపల అమ్మకాల మాటున బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తూ.. అక్రమంగా మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడంతో సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. ఇలాంటి సమయంలో అక్కడే బహిరంగంగా మద్యం విక్రయాలు కొనసాగుతుండటంతో.. కొందరు మద్యం సేవించి ప్రాజెక్టు గేట్ల వద్దకు వెళ్లడం, ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీలు దిగడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇలాంటి ఘటనల్లో కాలు జారి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా బెల్ట్ షాపులపై కఠిన చర్యలు మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. బెల్ట్ షాపుల వ్యవహారాన్ని మీడియా పలుమార్లు ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. మా దృష్టికి అలాంటివి ఏమీ లేవు.. మా దృష్టికి తీసుకొస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం అని సీఐ మీడియా ముందు బాధ్యత లేని సమాధానం చెప్తున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది..అక్రమ మద్యం విక్రయాలు గుర్తించడం కూడా ఎక్సైజ్ అధికారుల డ్యూటీలో భాగమే కాదా.. ప్రజలు చెప్పాలి.. మీడియా చూపించాలి.. అప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకుంటారా..బెల్ట్ షాపులను గుర్తించడం.. అనధికార మద్యం విక్రయాలను అడ్డుకోవడం.. తనిఖీలు నిర్వహించడం.. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం.. ఇవన్నీ ఎక్సైజ్ శాఖ బాధ్యతల్లో భాగం కాదా..?అయితే జూరాలలో ఏళ్లుగా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న మా దృష్టికి రాలేదు అనే సమాధానం మాత్రం అధికారుల నిఘా వ్యవస్థపై తీవ్ర విమర్శలకు



తావిస్తోంది.ఇక స్థానికంగా వినిపిస్తున్న మరో టాక్.. బెల్ట్ షాపుల నుంచి నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.వాస్తవం ఎంత అన్నది ఉన్నతాధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. ప్రభుత్వం అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్న వేళ.. జూరాల పర్యాటక కేంద్రంలో మాత్రం బెల్ట్ షాపుల దందా కొనసాగుతున్న పరిస్థితి అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఇది కేవలం అక్రమ మద్యం విక్రయాల వ్యవహారం కాదు.. పర్యాటకుల ప్రాణ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశం. అందుకే జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి.. జూరాలలో అక్రమ మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీస్, ఎక్సైజ్ అధికారుల బాధ్యతను కూడా తేల్చాలని స్థానికులు కోరుతున్నారు. మా దృష్టికి తీసుకొస్తే చర్యలు అనే మాటలతో కాదు..అక్రమ మద్యం కనిపించకముందే గుర్తించి అడ్డుకోవడమే అధికారుల అసలు డ్యూటీ అని గుర్తుచేస్తున్న స్థానికులు.

## మెడికో విద్యార్థిని ప్రియాంక మృతి బాధాకరం...

- ప్రియాంక మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి.
- టిఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్.



జోగులాంబ గద్వాల : అలంపూర్ నియోజకవర్గం అయిజ మండలం ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన మెడికో విద్యార్థిని ప్రియాంక మృతి అత్యంత బాధాకరమని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ప్రియాంక మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. పేదలకు ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో వైద్య విద్యను అభ్యసిస్తున్న ప్రియాంక భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబానికి ఆమె మృతి తీరని విషాదాన్ని మిగిల్చిందన్నారు. ఈ నెల 3న రాజమండ్రిలో మద్యం మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు కారుతో ఢీకొట్టడంతో ప్రియాంక తీవ్రంగా గాయపడిందని, అనంతరం చికిత్స పొందుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడం ప్రియాంక మృతి అందరిని కలచివేసిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిందితులను కఠినంగా శిక్షించి అట్టి కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

## బస్సు ఢీకొని యువకుడు మృతి

దేవరకొండ: చందంపేట (సమయం ప్రతినిధి) : చందంపేట మండలం కంబాలపల్లి కి చెందిన శ్రీను వయసు : 38 సంవత్సరాలు ఈరోజు ఉదయం తన సొంత పనిమీద మల్లెపల్లి కి పోయి, తిరిగి ఇంటికి తన పల్సర్ బైక్ నెంబర్ ట్రా 05 ఖీ ఖీ 6232 పై వస్తుండగా గుంతల తండా, సర్కిల్ తండాలకు మధ్య గల తెల్ల పలుగు గుట్ట వద్దకు వచ్చేసరికి 11 గంటల సమయంలో పాత కంబాల పల్లి నుండి బయలుదేరిన ఆర్టీసీ బస్సు నెంబర్ ట్రా 05 ౹ 0170 బస్సు ఎదురుగా వస్తున్నటువంటి పల్సర్ బైకు ను ఢీకొనగా శ్రీను అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు . ఇట్టి సమయంలో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు స్పందిస్తూ బస్సు డ్రైవర్ అతివేగంగా బస్సు నడపడంతో ప్రమాదం కారణమని అన్నారు. మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు చందంపేట సబ్ ఇన్స్పెక్టర్. లోకేష్. మాట్లాడుతూ. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ను విచారించి అట్టి దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అన్నారు.

## విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా

నెల్లూరు : ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం.

వేకువ సమయం
మంగళవారం 11 ఆగష్టు 2026




## ప్రెగ్నెన్సీలోనూ రిస్క్ చేస్తున్న దీపికా..

బాలీవుడ్ స్టార్ నటి, లేడీ సూపర్ స్టార్ దీపికా పదుకొణే వర్క్ కమిట్‌మెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏ పాత్ర చేసినా, ఏ ప్రాజెక్ట్‌ను ఒప్పుకున్నా తన వంద శాతం శ్రమను అందించే దీపికా.. తాజాగా మరోసారి తన డెడికేషన్‌తో సినీ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఎనిమిది నెలల నిండు గర్భవతిగా ఉన్న ఆమె, త్వరలోనే అంటే సెప్టెంబర్‌లో తన రెండవ బిడ్డకు జన్మనివ్వబోతున్న విషయం తెల్సిందే. అయితే ప్రసవ సమయం దగ్గరపడుతున్నా కూడా ఆమె విశ్రాంతి తీసుకోకుండా సెట్స్‌లోనే ఉండటం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. రాకా కోసం ప్రెగ్నెన్సీలో కూడా రిస్క్ తీసుకొంటుందట దీపికా.

ప్రస్తుతం దీపికా నటిస్తోన్న భారీ ప్రాజెక్ట్ రాకా. అల్లు అర్జున్- అట్లీ కాంబోలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక రాకా షూటింగ్‌ను డెలివరీకి ముందే పూర్తి చేయాలనే పట్టుదలతో దీపికా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆమె సెట్స్‌లోనే సమయం గడుపుతూ, అవసరమైనప్పుడు అర్ధరాత్రి వరకు కూడా షూటింగ్‌లో పాల్గొంటుందని ఇండస్ట్రీ వర్గాల నుంచి టాక్. ప్రసవానికి కొద్దిరోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, సినిమా షెడ్యూల్స్ ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఆమె చూపుతున్న ఈ అంకితభావం చూసి చిత్ర యూనిట్, సాంకేతిక నిపుణులు అవాక్కవుతున్నారట. ఆమె ప్రొఫెషనలిజం, సినిమా పట్ల ఉన్న ప్రేమాభిమానాలను చూసి యూనిట్ సభ్యులంతా హ్యాట్సాఫ్ చెబుతున్నారని సమాచారం. తన పర్సనల్ లైఫ్‌ను, ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌ను సమానంగా బ్యాలెన్స్ చేస్తూ నటిస్తున్న దీపికా పదుకొణేను చూసి అభిమానులు ది రియల్ క్వీన్ అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. మరి ఈ సినిమాతో దీపికా ఎలాంటి విజయాన్ని అందుకుటుందో చూడాలి.




## ఇది కనకరాజు కలెక్షన్ల తాండవం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ చాలా గ్యాప్ తర్వాత మరోసారి తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో చూపిస్తున్నారు. ఆయన హీరోగా నటించి, హారర్ కామెడీగా తెరకెక్కిన 'కొరియన్ కనకరాజు' విడుదలైన మూడు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ మార్క్‌ను దాటుకుని లాభాల బాటలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాపై మేకర్స్ మొదటి నుంచి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టింది. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్న ఈ చిత్రం.. ఆ తర్వాత దానిని కంటిన్యూ చేస్తూ మొదటి మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ను చేరుకోవడంతో.. మేకర్స్ యమా హ్యాపీగా ఉన్నారు. ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ సినిమాకు బిగ్ ప్రమోషన్‌గా మారడంతో.. రోజురోజుకూ 'కొరియన్ కనకరాజు'కి ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా హాఫ్ మిలియన్ డాలర్ల మార్క్‌కు చేరువలో ఉన్నట్లుగా మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అలాగే, తొలి వీకెండ్‌లో ప్రపంచవ్యాప్తంగా రూ.37.4 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లుగా తెలుపుతూ, మేకర్స్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సోమవారం తెలంగాణలో బోనాలు సెలవు కావడంతో సినిమాకు మరో అడ్వాంటేజ్ లభించినట్లైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా అద్భుతంగా ఉండటంతో, ఈ హాలిడే రోజు కూడా కనకరాజు కుమ్మేసే అవకాశం లేకపోలేదు.




## ఆ వార్తలన్నీ రూమర్లే..

అక్కినేని యంగ్ హీరో అఖిల్ అక్కినేని ఎట్టకేలకు లెనిన్ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నాడు. ఇక లెనిన్ ప్రమోషన్స్ లో అఖిల్ చాలా మెచ్యూర్డ్ గా కనిపించాడు. అలాగే మాట్లాడాడు. అతడిలోని పరిపక్వత చూసి ఫ్యాన్స్ సైతం సంతోషించారు. అందుకే తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు. లెనిన్ తో వచ్చిన హిట్ ని గుర్తుపెట్టుకొని ప్రేక్షకులు తనను ఎలా చూడాలనుకుంటున్నారో అలా మారుతున్నాడు. అయితే, గత కొన్ని రోజులుగా ఆయన చేయబోయే తదుపరి చిత్రం గురించి సోషల్ మీడియాలోనూ, ఫిల్మ్ నగర్ వర్గాల్లోనూ రకరకాల వార్తలు, ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. పలువురు దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా పవన్ సాధినేని దర్శకత్వంలో అఖిల్ సినిమా చేస్తున్నాడు అంటూ వార్తలు గుప్పుమన్నాయి. దీంతోఅభిమానుల్లోనూ తీవ్ర గందరగోళం నెలకొంది.

ప్రేమ ఇష్క్ కాదల్ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అయ్యాడు పవన్ సాధినేని. దీని తరువాత సావిత్రి, సేనాపతి లాంటి సినిమాలు చేశాడు. అవేమీ ఆశించిన ఫలితాలను అందుకోలేదు. ప్రస్తుతం ఆయన దుల్కర్ సల్మాన్ తో ఆకాశంలో ఒక తార సినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా రిలీజ్ కు సిద్ధమవుతోంది. ఇక దీని తరువాత అఖిల్ తోనే సినిమా అంటూ వార్తలు పుట్టుకొచ్చాయి. ఇప్పటికే పవన్.. అఖిల్ కి కథ వినిపించాడని, కథ నచ్చడంతో అయ్యగారు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చినట్లు పుకార్లు వచ్చాయి. దీంతో అఖిల్ పీఆర్ టీమ్ రంగంలోకి దిగి అసలు నిజం చెప్పింది.

'అఖిల్ అక్కినేని ఇప్పటివరకు తన తదుపరి ప్రాజెక్ట్‌ను అధికారికంగా సంతకం చేయలేదు. కాబట్టి ఈ విషయమై ప్రచారంలో ఉన్న ఎలాంటి రూమర్లను నమ్మవద్దని, వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని అందరినీ కోరుతున్నాం. ఆయన తదుపరి చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను త్వరలోనే మేమే స్వయంగా వెల్లడిస్తాం' అంటూ చెప్పుకొచ్చారు. ఈ ప్రకటనతో అఖిల్ నెక్ట్స్ మూవీపై వస్తున్న అన్ని రకాల పుకార్లకు చెక్ పడింది. కథల ఎంపికలో ఏమాత్రం తొందరపడకుండా, పక్కా ప్రణాళికతో ఒక పవర్‌ఫుల్ అండ్ వైవిధ్యమైన ప్రాజెక్ట్‌ను సెట్ చేసే పనిలో అఖిల్ ఉన్నారు. త్వరలోనే రాబోయే ఆ అధికారిక సర్ప్రైజ్ కోసం అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# Cinema




## ఈ కాంబో పడితే రికార్డులు బద్దలే!

సినీ ప్రపంచంలో అందరిలా ఆలోచిస్తే ఆయన సందీప్ రెడ్డి వంగా ఎందుకు అవుతాడు? అర్జున్ రెడ్డి నుంచి యానిమల్ వరకు ప్రతి సినిమాలోనూ, తన ప్రతి ఆలోచనలోనూ ఒక విలక్షణమైన ముద్ర వేసే ఈ ఫైర్‌బ్రాండ్ డైరెక్టర్, సోషల్ మీడియాలో ఎలాంటి పోస్ట్ పెట్టినా అది ఒక సంచలనమే అవుతుంది. గతంలో చిరంజీవి ఆరాధన పోస్టర్‌తో మెగా ఫ్యాన్స్‌ని ఫిదా చేసిన సందీప్, ఈసారి సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా చేసిన ఒక వినూత్న ప్రయోగం ఇప్పుడు టాలీవుడ్‌లో సరికొత్త చర్చకు తెరలేపింది. సాధారణంగా ఒక హీరో పుట్టినరోజు వస్తే డిజైనర్ పోస్టర్లతో శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీ. కానీ సందీప్ వంగా ఏఐ సాంకేతికతను వాడుకుని మహేష్ కి శుభాకాంక్షలు చెప్పి షాక్ ఇచ్చాడు. మహేష్ తండ్రి, సూపర్ స్టార్ కృష్ణ ఐకానిక్ మూవీ కిరాయి కోటిగాడులోని మాస్ సీన్‌ను రీ-క్రియేట్ చేశాడు. 'పేరు కోటిగాడు.. ఊరు తెనాలి. ఉద్యోగం కిరాయి తీసుకొని కాళ్లూ చేతులు విరగ్గొట్టడం' అంటూ కృష్ణ చెప్పే ఆల్-టైమ్ మాస్ డైలాగ్‌ను మహేష్ బాబు గొంతుతో, ఆయన బీడీ వెలిగిస్తున్న ఆల్ఫా యాటిట్యూడ్ అవతార్‌లో ప్రెజెంట్ చేసి ఏకంగా నెట్టింటిని షేక్ చేశాడు. ఇక దీంతో మహేష్ ఫ్యాన్స్ అందరూ సందీప్ - మహేష్ కాంబో ఫిక్స్ అయినట్లే అని చెప్పుకొస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో రావాల్సిన సినిమా ఆగిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ స్పెషల్ విష్ చూసిన తర్వాత ఘట్టమనేని అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించాయి. వారణాసి తరువాత మహేష్ .. సందీప్ రెడ్డి దర్శకత్వంలోనే ఒక సినిమా చేయనున్నాడని టాక్ నడుస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో మహేష్ బాబుతో సందీప్ రెడ్డి వంగా సినిమా తీస్తే, అది కచ్చితంగా ఈ కిరాయి కోటిగాడు తరహాలో అత్యంత పవర్‌ఫుల్, రా యాటిట్యూడ్ ఉన్న క్యారెక్టర్‌తోనే ఉంటుందని ఫ్యాన్స్ బలంగా నమ్ముతున్నారు. ఏది ఏమైనా, రాజమౌళి వారణాసి అప్‌డేట్ కోసం ఎదురుచూసిన ఫ్యాన్స్‌కు సందీప్ వంగా ఇచ్చిన ఈ ఏఐ సర్‌ప్రైజ్ ఒక రేంజ్‌లో కిక్ ఇచ్చిందనే చెప్పాలి.




## నిర్మాతలుగా యువ కథానాయకులు

ఇప్పటి హీరోల్లో కొందరు నటనలో కొనసాగుతూనే నిర్మాతలుగానూ అలరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఆ రూటులో సాగినవారెందరో ఉన్నారు. నవతరం కథానాయకుల్లో రామ్ పోతినేని, మంచు మనోజ్ వంటివారు చిత్ర నిర్మాణంలో అడుగుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. 'రాపో సినిమాటిక్స్' పతాకంపై తన సోదరుడు పోతినేని కృష్ణ నిర్మాతగా రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇక మంచు మనోజ్ 'ఎమ్.ఎమ్.ఆర్ట్స్' పతాకంపై ప్రతిభను ప్రోత్సహిస్తూ ఇతరులకు అవకాశాలు కల్పించే పనిలో ఉన్నారు. వీరిద్దరూ ప్రొడ్యూసర్స్ గా 'ఆన్ ద వే'లోనే ఉన్నారు. వీరి సినిమాలు జనం ముందుకు వచ్చాకే వారి అభిరుచి ఏ పాటిదో తెలుస్తుంది. ఇంతకు ముందు నితిన్, విజయ్ దేవరకొండ, అల్లరి నరేశ్, సుధీర్ బాబు వంటివారు కూడా నిర్మాతలుగా మారారు. అఖిల్ హీరోగా నితిన్ 'అఖిల్' సినిమా నిర్మించారు. 'మీకు మాత్రమేచెబుతా' అనే చిత్రంతో విజయ్ దేవరకొండ నిర్మాతగా మారారు. ఈ ఇద్దరు హీరోలు ఇతరులతో చిత్రాలు నిర్మించేసి తరువాత నిర్మాణం వైపు చూడలేదు. అల్లరి నరేశ్ 'బందిపోటు', సుధీర్ బాబు 'నన్ను దోచుకుందువటే' సినిమాల్లో హీరోలుగా నటిస్తూనే నిర్మించారు. మళ్ళీ చిత్ర నిర్మాణంవైపు వీరు కూడా చూడకపోవడం గమనార్హం. కిరణ్ అబ్బవరం ఇతరులతో 'తిమ్మరాజు పల్లి టీవీ' నిర్మించారు. తాను హీరోగా నటిస్తూ- దర్శకత్వం వహిస్తూ కిరణ్ అబ్బవరం 'రియాలిటీ' అనే సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాతో కిరణ్ అబ్బవరం బహుముఖ ప్రజ్ఞ బయల్పడనుంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085